
# కథ



# నువ్వసలు నచ్చుతా?..

## పి.వి.డి.ఎస్. ప్రకాష్

శ్రీవారికి-

మీరసలు నచ్చలేదు. నిజంగా చెబుతున్నాను. మీరు నచ్చలేదు. మొదట్లో నచ్చారనే భ్రమపడి తలొంచి తాళి కట్టించుకున్నాను. అదే నే చేసిన పెద్ద పొరపాటు. ఆ పొరపాటును ఈ జీవితంలో సరిదిద్దుకోగలనా?

-శ్రీమతి

గదంతా నీలిరంగు వెలుతురు పరుచుకుంది. ఆ వెలుతురు గోడ గడియారం వంక చూస్తుంటే ఎన్నో జ్ఞాపకాలు చేదుగుళికలై గొంతుకడ్డం పడుతున్నాయి. గుండెని తొలిచేస్తూ తడిచేసేస్తున్నాయి. ఇంకాసేపట్లోనే చిన్నముల్లుని పెద్దముల్లు మింగేయబోతోంది.

ఆ దృశ్యం ప్రతీరాత్రీ నాకళ్లకు అలవాటైన దృశ్యమే.

పెద్దముల్లు కాఠిన్యంతో వ్యవహరిస్తూ చిన్నముల్లును తన ఉక్కు కౌగిట్లో కబళించబోతోంది. ఆ తర్వాత చెప్పేందుకేముంది?

'చిన్నముల్లు' అస్థిత్వాన్నే కోల్పోతుంది. ఆ పెద్దముల్లు మాౖతం తన బాహుబంధాన్ని అంతులేని అభిమానంగా చిత్రీకరిస్తుంది.

ఆ గాఢ పరిష్వంగాన్ని ఎనలేని ఆప్యాయతగా నమ్మిస్తుంది.

సరిగా ఆ వేళలో ఆ గడియారంలో ఆ రెండుముళ్ళూ ఒకదానిపై ఒకటిగా, ఒకే ఒక్కటిగా, కేవలం ఒకే ఒక్కటిగా కనిపిస్తాయి.

'ఒకే బాట-ఒకేమాట-ఒకే గమ్యాన్ని' తలపిస్తాయి.

ఒకే ఒక పెద్దముల్లు అత్యంత నిరంకుశంగా తన ప్రాభవాన్ని చాటుకుంటూ ఉంటుంది.

అప్పుడే.....ఠంగ్....ఠంగ్‌మంటూ గంటలు గదంతా మార్మోగుతాయి.

అంటే సమయం అర్ధరాత్రి పన్నెండుగంటలన్నమాట.

కేలండర్‌లో మరో తేదీ మారే సంధికాలం.

పాపం అమాయకంగా ఆ చిన్నిముల్లు తన సర్వస్వాన్ని అర్పించేసి ఏదో ఘనకార్యం చేసి నట్లు సంబరపడుతుంది.

తరచి తరచి చూస్తే ప్రతి అర్ధరాత్రి ఇలా కాలాన్ని స్తంభింపచేస్తూ సాగే ఈ తంతులోనూ నాకు సృష్ట్యాది నుంచి సాగివస్తున్న 'స్త్రీపురుషుల' కథే కనిపిస్తుంది.

తరాలు మారినా, జగాలు మారాయనిపి స్తున్నా ఎప్పటికీ ముగింపునకు నోచుకోని ఈ కథలో ప్రతి స్త్రీ ఒక చిన్నముల్లే. ప్రతి పురుషుడూ పెద్దముల్లే.

ఈ విషయంలో నువ్వూ మినహాయింపు కానేకావు.

ఆ సంగతి తెలిసినా, ఆ మాటని బయటపెట్ట లేకపోయాను.

కానీ ఇప్పుడో....ఇదే సుముహూర్తమని భావించి ఇక్కడే ఎలుగెత్తి నీపై నాకున్న అభిప్రా యాన్ని గట్టిగా చెప్పాలనిపిస్తోంది.

ఏకశయ్యమీద నా పక్కన గుర్రుపట్టి పడు కున్న నిన్ను ఈ అర్ధరాత్రి వేళ 'పాపం....నిద్రపో తున్నాడనే కరుణ, జాలీ' లేకుండా నీ నిద్ర చెడ గొట్టి లేపి మరీ గొంతెత్తి అరవాలనుంది.

ప్రతిరోజూ ఇలాంటి అర్ధరాత్రి వేళ లో పన్నెండయ్యేసరికి నాకూ నా ఉనికిని, నా అస్థి త్వాన్ని కోల్పోయిన ఒకానొక క్షణం గుర్తొస్తుంది.

పెద్దముల్లువై నువ్వు నన్ను ప్రేమపూర్వక మాయపొరతో నన్ను కబళించే అరుదైన సన్ని వేశం జ్ఞప్తికి వస్తుంది.

అప్పుడే నా గుండెల్లో పదునైన ముల్లు గుచ్చుకుంటుంది.

ఎదంతా బాధతో తల్లడిల్లుతుంది.

కబళించడం కాకుండా, కౌగిలించుకోవ డంలోని మాధుర్యం నీకెప్పటికి అర్థమవుతుంది? నా మనసుని కనిపెట్టి నడుచుకోవడం నీకెప్పటికి అలవాటవుతుంది? ఇప్పటివరకూ సమాధానం దొరకని ప్రశ్నలే ఈరెండూ.

సరిగ్గా ఏడాది కిందట ఇదేరోజున ఇలాంటి 'జీరో అవర్'లోనే నేను 'జీరో'గా మారిపో యాను.

శూన్యంగా, సున్నాగా మారిపోయాను.

సున్నాకు ఎప్పుడూ విలువుండదని, ఏదైనా ఓ అంకె పక్కనున్నప్పుడే దానికి అసలైన విలు వని చిన్నప్పుడెప్పుడో లెక్కల మాష్టారు చెప్పిన సంగతి మరచిపోయినందుకు ఫలితమిప్పుడు అనుభవిస్తున్నాను.

అలాంటి మతిమరపు సమయంలోనే నేను నీ శ్రీమతిగా మారిపోయాను. స్వేచ్ఛగా వెన్నెల మైదానాల్లో రెక్కలు విప్పుకుని ఎగిరే సుందరవా హ్యాళికి అప్పుడే తెరపడిపోయింది. మనిద్దరి పెళ్లి జరిగిపోయింది. అదంతా గుర్తొస్తుంటే చిత్రంగానే ఉంటోందిప్పటికీ నాకు.

ఇలాంటి ఓ అర్ధరాత్రివేళలోనే నిదురబరు వుతో నా కనెప్పలు వాలిపోతున్న సమయంలో నువ్వు వంగి చటుక్కున నా మెడలో పసుపు తాడు వేసేసావు. యావత్ ప్రపంచం చిక్కని చీకట్లో గాఢ సుషుప్తిలో ఉన్నవేళలోనే మనిద్దరి జీవితాల్లో జీవితాంతం గుర్తుంచుకోదగ్గ సంచ లనం జరిగిపోయింది.

ఆ చీకట్లో నిద్రకళ్లతోనే మనకున్న కొద్దిపాటి బలగం, బంధువర్గం మనచుట్టూ చేరి మన ఆ శుభకార్యానికి నేతృత్వం వహించారు.

ఆ తంతుకు సాక్ష్యంగా నిలిచారు.

ఇక అప్పట్నుంచీ మనిద్దర్నీ దంపతులుగా తీర్మానించేశారు.

ఒకే కప్పుకింద నూరేళ్ళూ 'సహజీవనం' సాగించమంటూ అనుమతిచ్చి అక్షింతలు వేసే శారు.

జంటగా బతకమంటూ అరుంధతిని చూపించారు.

మనసా వాచా కర్మణా జీవితాన్ని సుసంపన్నం చేసుకోమని పురోహితులవారు దక్షిణ అందుకుంటూనే ఆశీర్వదిస్తూ అభిల షించారు.

'ధర్మార్థ కామమోక్షా'ల్లో ఒకరికొకరు తోడుగా, నీడగా ఉండాలని ఆ వేడుకకు ముందుగా మనమిచ్చిన బఫే డిన్నర్‌లో రుచి చూసి మరీ దీవించేశారు బంధుమిత్రులు.

ఆ ఘట్టంతో మనం జీవితంలో ఏదో సాధించే శామన్నట్టు ప్రశంసాపూర్వకంగా మంగళవా ద్యాలు మిన్నుముట్టాయి.

ఒక్కసారిగా హోరెత్తిన ఆ వాద్యఘోషకు మనకు అతిథులు గాని, మన పెళ్లికి రాని, మన చుట్టూ ఉన్న ఇళ్లలోని కొందరెంత ఉసూరుమ న్నారో?

ఆరాత్రి నిద్రకు వెలియై, మనల్నెంతగా శాప నార్థాలు పెట్టారో?

* * *

తెల్లారితే నువ్వు నా మెడలో బిగించిన తాళి బంధానికి వార్షికోత్సవం జరుగబోతోంది.

నీవు నాకు మూడు ముళ్ళేసి ముచ్చటగా మూడొందల అరవై ఐదోరోజు పూర్తవుతుంది.

ఒకే ఇంట్లో మనిద్దరం సహజీవనం సాగిస్తూ పన్నెండునెలలకాలాన్ని ఎంత నిర్లిప్తంగా వెనక్కి నెట్టేసామో, తలచుకుంటే బాధేస్తోంది.

ఏడాదిగా మనం కలిసి బతుకుతున్న సంద ర్భాన్ని పురస్కరించుకుని నీవు చుట్టాల్ని, చుట్టుప క్కలవారినీ పిలిచి ఓ పండుగ చేద్దామంటు న్నావు. అప్పుడు నాకనిపించిందొక్కటే జారిపో తున్న కాలాన్ని లెక్కకట్టుకుంటూ, కొన్ని కొండగు ర్తులతో జీవనోత్సవాలు జరుపుకోవడం కాదు, కావాల్సింది. ఆ జీవితం ఎంతనాణ్యతతో సాగు తోందో గమనించాలని.


అయినా నీ మాటకు నేనెప్పుడైనా ఎదురుచె ప్పానా? అసలు నువ్వు నా పెదవుల కదలికలను గమనిస్తేనా?


ఎప్పుడో నీకు ముద్దొచ్చినప్పుడు పొగ చూరిన నీ మొద్దు పెదాలతో నా పెదాలను బంధి స్తావు. అదేనా నీవు చూపించే ప్రేమ.

ఏ సౌందర్యలేపనాలు అద్దకుండానే అరుణా రుణ అందాల ఆ పెదవులను ప్రేమపూర్వకంగా ఒక్కసారైనా నువ్వు తేరిపారచూస్తే కదా! నా మోవి కదలికలను నీవు గుర్తిస్తే కదా! ఆ కదలిక ల్లోని మాటని గమనిస్తే కదా!

ఇలాంటి వ్యక్తిని ఏం చూసి మనసు పారేసుకు న్నానా? అనిపించేది చాన్నాళ్ళూ.

పెళ్లికాకముందు ఎదురింటి ఒంటరిగదిలో బ్యాచలర్‌గా దిగిన నీవు డ్యూటీ పూర్తిచేసుకుని సాయంసమయాల్లో ఆ ఇంటిపై అటూ ఇటూ తిరుగాడుతూ సేదతీరుతున్నప్పుడు నీ విగ్రహం చూసి ఒకానొక బలహీనక్షణంలో నా నిగ్రహం





పట్టుజారింది.

కట్ బనియన్‌లోనుంచి కండలు తిరిగిన భుజాలు నన్నెంతగానో ఆకర్షించేవి. నువ్వు అందగాడివే అనిపించింది నాకు తొలిచూపుల్లోనే.

పచ్చని ఛాయ, గుబురుమీసాలు, చురుకైన కళ్ళు, 'నే కిటికీలోంచి చూస్తున్నాను' అని తెలుసుకోగానే ఆ కళ్లల్లో కనిపించే ఆ కళ్ళు అప్పట్లో ఎంతగానో నచ్చేవి.

ప్రతి సాయంత్రం నీవు కనిపించేంతవరకూ నేనింట్లో ఎంతగానో ఎదురుచూసేదాన్ని. అను ఇంటర్ పూర్తిచేసి పై చదువులు చదవలేనిస్థితిలో నేర్చిన అక్షరాలను సద్వినియోగం చేసుకుంటూనే చదివే ఫిల్మ్ మేగజైన్స్‌లోని హీరోలంతా నీలాగే కనిపించేవారు. చూసిన ప్రేమకథా చిత్రాల్లోని అపురూపసన్నివేశాల్లో నాతో పాటు నిన్నూ ఊహించుకునేదాన్ని. అప్పుడు సౌందర్యసీమలెన్నింటిని నీ జంటగా చుట్టివచ్చానో నాకు మాత్రమే తెలుసు. నేపాడుకున్న'జంటజావళీలు' నేను నేర్చుకున్న'యుగళాలు' ఇప్పటికీ నా మనసు మరిచిపోలేదు.

నన్నెప్పట్నుంచో గమనిస్తున్న నీవు ఒరోజు ఆఫీసుకు పోతూ పోతూ మా ఇంటి కిటికీ పక్కన ఓ లేఖను ఉండకట్టి జారవిడిచావు. అది ఖచ్చితంగా ప్రేమలేఖేనని నాకు తెలుసు. నా గురించే నీవు రాశావని తెలుసు. అంతే గుండె వేగంగా కొట్టుకుంది.

ఓ అబ్బాయి, ఓ అమ్మాయిని కొద్దికాలంగా చాటుమాటుగా గమనిస్తూ ఎదురుపడుతున్నప్పుడు కళ్లెగరేస్తూ పెదవులను సాగదీసి చిర్నవ్వులు నవ్వుతూ ఏదో చెప్పాలని తడబడుతూ చెప్పలేక వెళ్లిపోతూ వెడుతూ వెడుతూ వెనక్కి తిరిగి చూస్తూ ఆ అమ్మాయి కనిపిస్తే కంగారుపడుతూ, కనిపించకపోతే బెంగపడుతూ ఉండడం... వయసు చేసే ఇంద్రజాలం కాక మరేమిటి ? ఎన్నో తెలుగు సిన్మాలు చూసిన అనుభవం ఉన్న నాక్కూడా ఆ కాగితం ఉండలో ఉండే సారాంశమేమిటో తెలుసు. అయినా, విప్పి చదవాలన్న ఆత్రుత. అలా ఆ ఉత్తరం జారవిడిచి నీవెళ్లిపోగానే... నేనూ నా ఇంటి గడప దాటాను. అలా, గడప దాటుతున్న క్షణంలో నాకసలు తెలీదు... గడప దాటేందుకు నే వేసిన అడుగులు నీ ఇంటిదారి పడతాయని.

అసలు ఆ ఉత్తరాన్ని నీవు నాకు రాస్తే... చదివింది మాత్రం మా అన్నయ్య. వీధిలో ఎవరూ లేని సందర్భాన్ని నిర్ధారించుకునే బయటకు వచ్చి ఆ కాగితం వచ్చి ఆ కాగితం ఉండని తీసుకుని గబగబా ఇంట్లోకి వెళ్లబోతుండగా.... ఎదురుగా అన్నయ్య.

కంగారుపడుతూ నా రెండు చేతులూ వెనక్కి దాచుకోబోగా... కోపంతో రంకెలు వేసిన నాన్న.

వెనకనుంచి వచ్చి చేతుల్లో అతి భద్రంగా దాచిన ఆ కాగితాన్ని చొరవగా తీసుకుని ఆటపట్టించిన చిన్నారి చెల్లెలు.

ఆ చెల్లెలు చేతుల్లోనుంచి బలవంతంగా లాక్కుని నీవొలకబోసిన ప్రేమపైత్యాన్ని ఆకళింపు చేసుకుని ఆగ్రహంతో ఊగిపోయిన అన్నయ్య.

ఆ తర్వాత జరిగినదేమిటో... నీకూ తెలుసు... మన రెండు కుటుంబాల మధ్యకు ఈ పంచాయితీ వచ్చింది.

లేఖ రాసింది నువ్వు.

అందుకుంది నేను.

నేపథ్యాన్ని చిలువలు పలవలుగా అల్లేసారు ఇరు కుటుంబ సభ్యులు.

అల్లరవకుండా ఉండేందుకు ఇద్దరికీ పెళ్లి చేయాలనే నిశ్చయానికొచ్చేసారు.

ముహూర్తాలు కుదిరాయి. పెళ్లయి దంపతులై పోయాం.

అయితే, నిజంగా మనం ప్రేమికులమా? మనసిచ్చి పుచ్చుకున్నామా? ఒకరిగురించి ఒకరం పూర్తిగా తెలుసుకున్నామా? కలిసి జీవించలేకుండా ఉండలేని పరిస్థితులను ఎదుర్కొన్నామా? సంకేతస్థలాల్లోని ఏకాంతాలను అనుభవించామా? ఒకరికోసం వెర్రిగా ఎదురుచూపులు చూసామా? వచ్చిన వెంటనే విరహాన్ని తట్టుకోలేక బిగికౌగిళ్ళలో ఒదిగిపోయామా? కాకెంగిలి జాంపళ్ళను ఇచ్చిపుచ్చుకున్నామా? అవేం లేదు. బ్రహ్మచారిగా ఉంటూ విడుదలవుతున్న ప్రతి సినిమా చూస్తూ నీవు, ఆ సిన్మాలతోపాటుగా కాలక్షేపంకోసం సిన్మా మాగజైన్లు చూస్తూ నేను 'ఒకరికొకరం' ఆటపట్టించుకోదలిచాం. అంతే!

దూరం నుంచి నిన్ను ప్రతి సాయంసమయంలో చూసే నా చూపుల్లో ఓ ఆకర్షణ నెలకొంది.

ఇరవైనాలుగ్గంటల రోజులో ఓ అరగంట సేపు మాత్రమే నిన్ను చూసేదాన్ని అపుడు కేవలం నీ శరీరాకృతి మాత్రమే కనిపించేది. నీ మనసు లోతుల్లోకి తొంగిచూసే అవకాశం కానీ, నీ అంతరంగం, ఆలోచన, వ్యవహార శైలి, లైఫ్ స్టయిల్ కానీ తెలుసుకునే వీలు చిక్కలేదు. ఒక్క నాకే కాదు, అరేంజ్డ్ మారేజెస్‌లోని పెళ్లిచూపుల్లోనూ ఏ వధూవరులకు ఆ విషయాలపై అవగాహన లభించనే లభించదు.

కానీ, ఇరవైనాలుగ్గంటలూ నీ చెంతనే ఉంటూ, నీ బతుకులో 'సగభాగాన్ని' పంచుకుంటున్న వర్తమానంలో మాత్రం... నీలో నాకు నచ్చని అంశాలు ఇపుడు నన్ను తెగ ఇబ్బంది పెట్టేస్తున్నాయి. సర్ది చెబుదామా...? అంటే 'అంతకన్ను ఇంత ముక్కు' చేసుకునే నీ వైఖరి నన్ను వెనక్కిలాగుతోంది.

డ్యూటీనుంచి రాగానే జోళ్లయినా విప్పకుండా సరాసరి పడగ్గదిలోకి రావడం, ఆ జోళ్లతోనే పరుపుపై అడ్డదిడ్డంగా పడుకోవడం, ఇంటిని పరిశుభ్రంగా ఉంచాలనే కనీస ఇంగితం లేకుండా ధూమశకటంలా గుప్పు గుప్పుమంటూ పొగ వదలడం, అభ్యంతరం చెప్పబోతే కసురుకుంటూ 'సిగరెట్ నా మొదటి పెళ్ళామంటూ విరుచుకుపడడం... ఇలా చెప్పుకుంటూ పోతే నీలో నచ్చని అంశాలెన్నో....

నిజానికి, నాకు నా బెడ్‌రూంని నీటుగా ఉంచుకోవాలనుంటుంది. పక్కలు ఎక్కి తొక్కితే పడుకోవాలనిపించదు. రెండ్రోజులకోసారి బెడ్‌షీట్లు, తలగడ గలీబులు మార్చాలని ఎంతగానో అనుకుంటాను. అలాగే, పడగ్గది మనిద్దరి సామ్రాజ్యం. ఆ సామ్రాజ్యంలోకి ఇతరులకు నో ఎంట్రీ.

అయితే, నీవు వేళాపాళాలేకుండా స్నేహితులందర్నీ ఇంట్లోకి, సరాసరి బెడ్‌రూంలోకి తీసుకొచ్చేస్తావ్. అది నాకు నచ్చదు. వాళ్ళని బెడ్‌రూంలోకి తీసుకురావద్దని నొక్కి మరీ చెప్పాలనిపిస్తుంది. కానీ, అది సాధ్యమయ్యేదెలా? పరాయివాళ్లంతా కుమ్మేసిన పక్కపై పడుకునే పరిస్థితి ఎంత దారుణం? అంతేనా...! డోర్ కర్టెన్లు, కిటికీ కర్టెన్లు ఎప్పటికప్పుడు మార్చాలని భావిస్తుంటాను.

అస్సలు పడనీయవు. ఇవన్నీ నీకర్థమయ్యేట్టు ఎలా విశదీకరించాలి?

సెలవులు, పర్వదినాలొస్తే నీ ధోరణి అయోమయంగా ఉంటుంది.

ఉదయాన్నే లేవవు. బద్ధకంగా రోజంతా గడుపుతుంటావు.

కనీసం ముఖమైనా కడుక్కోవడానికెంత బద్ధకమో... తలచుకుంటే పెద్ద బండరాయి తీసుకుని నీ తలపై మోదాలన్నంత ఉక్రోషం కలుగుతూంటుంది.

ఇంటిమీద, వంటిమీద శ్రద్ధ లేకపోవడం నీలో నచ్చని గుణం. ఈ వార్షికోత్సవం సందర్భంగానైనా నీ వైఖరి మార్చుకోగలవనే నమ్మకం నాకు కలగించలేవా, నేస్తమా! అదే నీవు నాకిచ్చే 'పెళ్ళిరోజు' కానుక.

* * *

శ్రీమతికి...

పెళ్ళికాకముందు రోజూ సాయంత్రాల్లో ఓ అరగంటసేపు నిన్ను చూసి భావుకతకు లోనయ్యాను. జీవితాంతం నా జతగా నిన్నిమ్మని కనిపించని దేముళ్ళను ఎంతగానో ప్రార్థించాను. నీ కళ్లలోకి అలా చూస్తూ ప్రపంచాన్ని జయించినంత సంబరంతో బతుకుని గడిపేయాలనుకున్నాను. రోజుకు అరగంట నిన్ను చూసే చూపుల్లో కలిగే రసానుభూతి... రోజంతా నీవు అందుబాటులో ఉన్నపుడు కలగటం లేదేం? అపుడు నీవెపుడు కనిపిస్తావా... అనే ఎదురుచూపుల్లోని మాధుర్యం... ఇపుడు నీవు అనుక్షణం కళ్లముందు కదలాడుతుంటే మిస్సవుతోందేం? ఏమో, ఒకరిపైఒకరికి మరింత విసుగు, కోపం తలెత్తకుండా ముందుగా మేలుకోవాల్సిందే. మొదటి ఏడాది పూర్తయ్యేసరికే... ఇలా వ్యతిరేకభావనలు కలిగితే ముందు ముందు జీవితం ఎంత నరకంగా ఉంటుందో... తలచుకుంటే భయమేస్తోంది. ఇపుడు నువ్వసలు నచ్చలేదనిపిస్తోంది. అసలు నేను నాకే నచ్చడం లేదు. ఎందుకో?


–శ్రీవారు

* * *

'బ్రహ్మచారి శతకమర్కటః' అంటారు కదా నువ్వినలేదా? ఇంటిని ఎలా మలచుకోవాలో బొత్తిగా తెలియనివాడిని. ఇల్లాలిని ఎలా చూసుకోవాలో అసలర్థంకానివాడనని. ఎందుకంటే, చిన్నతనంనుంచే చదువులపేరుతో హాస్టల్ జీవనం అలవాటైపోయింది. పట్నవాసంలో కాలేజీకొచ్చినా నలుగురైదుగురు స్నేహితులతో చాలీచాలని గదుల్లో మకాం. గతించిన నా జీవితంలోని అధ్యాయం. సిగరెట్లు, చీట్లపేకలు, సెలవుల్లో సూర్యాస్తమయం దాకా పగటి నిద్దరలు, అర్ధరాత్రి షికార్లు.. అదో రకమైన బతుకు. ఎవరిబట్టలెవరు కట్టుకుంటున్నారో, ఎవరి తువ్వాళ్లు ఎవరు తుడుచుకుంటున్నారో మేమెవరమూ ప్రత్యేకించి గుర్తించేవారంకాదు. టూత్‌పేస్ట్ దగ్గర్నుంచీ అన్నింటినీ సమంగా వినియోగించుకోవడమే మాకు తెలుసు. ఉద్యోగం వచ్చిన తర్వాతనే తొలిసారిగా ఫ్రెండ్స్ లేకుండా ఓ గదిలోకి అద్దెకు దిగాను. అపుడే కదా, నీతో 'చూపుల బాంధవ్యం' ఏర్పడింది. ఎందుకో, నిన్నలా చూస్తుంటే చూడాలనిపించేది. నే చూసిన తెలుగు సిన్మాల హీరోయిన్లంతా నిన్ను చూస్తుంటే 'క్యూ' కట్టేవారు. పోస్టర్‌పైనా, థియేటర్లోనూ, చివరికి మాగజైన్లలోనూ తరచూ వారు కనిపించి, అందాలతో సమ్మోహన పరిచినా సరే, నా పిడికెడు గుండె నిన్ను చూస్తేనే విలవిల్లాడేది. చిత్రంగా, నా మనసును నీవే కొల్లగొట్టేసావు.

కేవలం సాయంసమయాల్లోనేకాదు, సూర్యుడి తొలి కిరణాలు ప్రతి ముంగిట్లో వెలుగుముగ్గులు వేసి ఉషోదయంలో కూడా మేడపైకి నువ్వు కనిపిస్తావేమోననే చిన్ని ఆశతో వచ్చేవాడిని. ఇంచుమించు చాలాసార్లు నువ్వు నా ఆశను వమ్ము చేయలేదు. ఏదో పనిచేసుకుంటూ, పెరట్లో నందివర్ధనం పూలను కోస్తూ, సజ్జలో వేస్తూ కనిపించేదానివి. అప్పటికే తలారా స్నానం చేసేదానివేమో... భుజాలపై వదులుగా వదిలేసిన శిరోజాలు హృద్యంగా ఉండేవి.

ఆఖరికి ఉండబట్టలేక రాత్రంతా నిదురకాసి ఓ ప్రేమలేఖ రాసాను. ఆ లేఖే చివరికి మన శుభలేఖగా మారిపోయింది. నిస్సందేహంగా నువ్వు అందగత్తెవే. కానీ, దూరపు కొండలు నునుపంటారు. దగ్గరైతేనే కదా, ఎత్తుపల్లాలు, రాళ్లురప్పలు తెలిసేది. దూరంనుంచి నిన్ను చూసి నేనెంతలా నిన్ను ఇష్టపడ్డానో... దగ్గరలో, నీ సమ



క్షంలో అంతలా ఇబ్బంది పడ్డాను, పడుతున్నాను కూడా.

నా పెళ్లాం ఓ అపరంజిబొమ్మలా ఉండాలని భావించేవాడిని. కళాకారుడిని కాను... కానీ, నా అర్ధాంగి ఎలా ఉంటే నాకు నచ్చుతుందనే విషయంలో నాక్కొన్ని అభిప్రాయాలున్నాయి. కవిని కాకున్నా... నీ తలపులతో నా మనసు ప్రబంధమే అయేది. గాయకుడిని కాకున్నా... నీ పేరుని పలికినప్పుడల్లా నా గొంతులో గాంధర్వం ఒలికేది. చిత్రకారుడిని కాకున్నా... ఎద కాన్వాసుపై వర్ణశోభితంగా నీ ప్రతి భంగిమ ఆవిష్కృతమయ్యేది.

నా ఊహల ఊర్వశివి నీవే. నా లోగిలికరుదెంచిన ప్రేయసివి నీవే. అది ఒకనాటి నా భావన. మరి, ఈనాడో...? ప్చ్!

ప్రతి సాయంత్రం విధులు ముగించుకుని నేనింటికొచ్చేసరికి గుమ్మానికి నీ చూపులు వేలాడదీసి మరీ నాకోసం ఎంతగానో ఎదురుచూడాలని నే తలచేవాడని. అందుకు విరుద్ధంగా ఉండేది నీ ప్రవర్తన. పెళ్ళయితే చాలు... ఆడపిల్లలు మారిపోతారా? అనుకునేవాడని. నువ్వు ఇస్త్రీ మడత నలగని చీర, జాకెట్టు వేసుకుని, జడలో జాతర చేస్తున్నట్టు బోల్డన్ని సన్నజాజులు, సంపెంగలు పెట్టుకోవాలని తలచేవాడిని. పండుగలు, పబ్బాలు, ప్రత్యేకదినాల్లో మాత్రమే అవి అలంకార వస్తువులని నీ భావన. ఏం చేస్తాను? ఎంతో ఆశగా నే తెచ్చిన పూమాలలను దేవుడిపటానికి వేసి సంతృప్తిపడితే.. ఆ సంతృప్తిని చూసి ఈ జన్మకింతే అనుకుంటూ మౌనంగా నిట్టూర్చేవాడిని. ఇంకా, ఎన్నో కోరికలు రెక్కలు ముడుచుకుని ఎదగూట్లో బజ్జున్నాయో నీకేం తెలుసు? విధుల్లో అలసి వచ్చిన నన్ను దగ్గరగా తీసుకుని గుండెలపై హత్తుకుని నా జుత్తుని నీ మునివేళ్లతో సుతారంగా నిమురుతుంటే... ఆ అపురూప క్షణాలను గుండెభరిణెలో భద్రంగా దాచుకోవాలని ఎన్నో కలలు కనేవాడిని. ఒకరి భుజంపై ఒకరు తలవాల్చి ఏ సుదూరతీరాలకో అంతులేని నడక సాగించాలని భావించేవాడిని. అలా కలల్లోనే నేను నీతో కలిసి 'కాట్‌వాక్' చేస్తున్నాను. అంతే!

చాలాసార్లు, నేనింటికొచ్చేసరికే.. నీవు పనిమనిషితో నీ బండగొంతుకేసుకుని వాదనకు దిగుతావ్.

అపుడపుడూ అమ్మవారిలా జుట్టు విరబోసుకుని కళ్లింతలు చేసుకుని అంట్లు తోమలేదనో, మరో చిన్న కారణంతో ఆ పనిమనిషిపై ఆగ్రహావేశాలతో ఊగిపోతుంటావు. పెళ్లికి ముందు నిన్నిలా ఊహించని కారణంగా, ఇపుడు అనివార్యంగా ప్రతినిత్యం ఎదురవుతున్న ఈ దృశ్యాలను నే జీర్ణించుకోలేకపోతున్నాను.


ఇక నీ చీరకట్టు, బొట్టు చూస్తేనా... ఆ క్షణమే సన్యాసం తీసుకుని ఏ హిమాలయాల్లోకో తరలిపోవాలన్న విరక్తి కలుగుతుంది. ఎన్ని కొత్త చీరలున్నా బీరువాల్లో భద్రపరుస్తావే తప్ప.. భర్త కంటికింపుగా కనిపించాలనే ఉద్దేశం నీకిన్నాళ్ళలో ఏ ఒక్కరోజు కలగలేదెందుకనో, నాకర్థం కాదు. అంతేకాదు, రోజువారి కట్టుడు చీరల్లో నువ్వెలా ఉంటావో తెలుసా? నిన్ను చూడగానే సగం కోరిక అక్కడికక్కడే చచ్చిపోతుంది. ఇలా అంటున్నందుకు వెరీ వెరీ సారీ! వంటింట్లో పనుల్తో సతమతమవుతూనే కూరల్లో వేసే పసుపు, కారం, మసాలాదినుసుల దగ్గర్నుంచీ చేతులకంటిన అన్ని మాలిన్యాలను తుడిచేసుకునేందుకు నీ దగ్గరున్న ఏకైక అస్త్రం, వస్త్రం చీరకొంగే.

ఆ కొంగు తడితడిగా, చిత్తడి చిత్తడిగా ఉంటుంది. అది నువ్వు గమనించవు. పెళ్ళి కాక ముందు అందంగా కనిపించాలని ఉబలాడపడే ఆడవారు... తీరా ఆ తంతు పూర్తయిందనిపించేసుకుని అప్పలమ్మల్లా తయారవడం ఎంత శోచనీయం. అంతవరకూ సౌందర్యవంతంగా ఉండాలనుకునేవారు... 'ఈపాటి మొగుడికి ఈ అందం చాల్లే...' అనుకుంటారేమో మరి. పెళ్లి కానపుడు చేసుకునే అలంకరణ పెళ్లి తర్వాత కట్టుకున్న భర్త కళ్లపడకూడదనే ఉద్దేశం ఎందుకు కలుగుతుందో... ఈ స్త్రీలకు.

పెళ్లికాకముందు అందమైన ఐశ్వర్యారాయ్‌లు సైతం.. పెళ్లి తర్వాత కల్పనారాయ్‌ల్లా ఎందుకు మారిపోతారో... నాకైతే అర్థం కావడంలేదు.

సాయంత్రం వేళ చక్కగా ఇంటిముందున్న ఖాళీ జాగాలో కుర్చీలు వేసుకుని ఎదురెదురుగా కూర్చుని కమ్మని కబుర్లు చెప్పాలనుకుంటాను నేను. ఆ కోరిక ఈ పన్నెండు నెలల కాలంలో అస్సలు తీరనేలేదు. ఇకపై తీరుతుందని అనుకోవడం లేదు.

నాకేమో వెన్నెల కురుస్తున్న శీతాకాలంలో ఏసి థియేటర్లో సెకండ్ షో చూడడం ఎంతో ఇష్టం. సన్నగా చలిలో వణుకుతూ ఇంటికొచ్చి... ఆ చలిని 'చెలి' సహకారంతో వెలివేయడంలోని మాధుర్యాన్ని అనుభవించాలనేది చిన్న కోరిక. నీకు చలిరాత్రులంటేనే గిట్టదు. అందులో, పది దాటితే నిద్రకో క్షణం ఆగవు.



ఇలా చెప్పుకుంటూ పోతుంటే.. ఎన్నో అంశాలు. నీలోనూ నచ్చనివి ఉన్నాయి. రేపు మన పెళ్ళయి మొదటి వార్షికోత్సవం జరగబో తోంది.

ప్రతిరాత్రీ నీలిరంగు వెలుతురు పరుచు కుంటున్న గదిలోని గోడగడియారం వంక చూస్తుంటాను.

పన్నెండు గంటలైతే చాలు.. పెద్ద ముల్లు, చిన్నముల్లు కావలించుకుంటాయి.

ఎంతటి వెచ్చదనాన్ని ఆస్వాదిస్తున్నాయో.. అవి., అంతవరకూ అనుభవించిన విరహాన్ని వెంటాడి తరుముతూ ఒక్కటవుతాయవి.

దృష్టి బట్టే సృష్టి.

శ్రీవారు

* * *

పెళ్ళి రోజు ఉదయమే–

''ఏమండీ...'' శ్రీమతి అరుపు.

''ఏవోయ్...!'' శ్రీవారి ప్రతిస్పందన.

ఇద్దరూ మధ్యగది గుమ్మం దగ్గరికి వచ్చి ఒక రికొకరు గట్టిగా 'ఢీ'కొన్నారు.

అతడి శిరసు ఆమె శిరసును తాకింది.

ఆమె నుదురు అతడి నుదురుతో పరాచకమా డింది. ఇద్దరి నాసికలూ పరామర్శించుకున్నాయి. నాలుగు పెదవులూ అసంకల్పితంగానే ముద్దాడు కున్నాయి. ఇద్దరి భుజాలు ఒకదానికొకటి ఆస రాగా నిలిచాయి.

క్షణం తర్వాత ఇద్దరూ తేరుకున్నారు.

''అంత గావుకేకెందుకు పెట్టావ్?'' శ్రీవారు అడగబోయారు.

''అదే ప్రశ్న నేను వేయబోయాను...'' ఆమె ముఖకవళిక చెప్పిన సమాధానమది.

ఇద్దరి చేతుల్లోనూ రెండు కాగితాలు.

ఆ ముందురోజు ఒకరికి తెలియకుండా ఒకరు రాసుకున్న లేఖలు.

నిజానికి, అవే అసలు, సిసలైన ప్రేమలేఖలు.

ఇద్దరికీ విషయం అర్థమైందేమో, మరి. ఇక, వారిద్దరూ అస్సలేం ప్రస్తావించుకోలేదు.

ఆ సాయంత్రం వారి వివాహవేడుక అత్యంత రమణీయంగా జరిగింది.

ఆ రాత్రే వారికి అసలైన తొలిరాత్రి. ఒకరి భావాలు ఒకరికి తెలిసిన నేపథ్యంలో... మన సులు తేలికపడిన సందర్భాన్ని మదనోత్సవ క్రీడకు వేదికగా మలచుకుంటున్నారా దంప తులు. అపుడే పెళ్లయిన దంపతుల్లా ఒకరి రహ స్యాలు ఒకరు తెలుసుకోవాలనే ఉత్సుకత వారిలో తెగ రెట్టింపయింది. తమ దగ్గరున్నది ఇచ్చేయాలని, ఎదురివారి సంపద కొల్లగొట్టేయా లనే తపన ఇరువురిలో మొదలైంది. ఆ తపనే అసలు సిసలైన సమరానికి ఆజ్యం పోసింది. ఇంకేముంది? నీలిరంగు వెలుతురులో పన్నెండు గంటలవేళ ఒక్క దగ్గరకు చేరిన చిన్నముల్లు, పెద్ద ముల్లు కదలకుండా కాలాన్ని స్తంభింపజేసిన వేళలో, ఆ గదిలో ఓ 'శృంగారజగతి' ఆవిష్కృత మైంది. ఇక, ఆ ఆటకు అంతం లేదు. ఇద్దరిలో పంతం నెగ్గించుకోవాలనే తాపత్రయమే తప్ప.

* * *

ఇపుడు–

ఆ ఇంటి శ్రీ అండ్ శ్రీమతి జీవనశైలిలో చెప్పు కోదగ్గ మార్పులు చోటుచేసుకున్నాయి.

శ్రీవారు ఏమాత్రం ఇంగితం లేకుండా... వీధుల్లోనుంచి సరాసరి బూట్లతో బెడ్‌రూంలోకి రావడం మానేసారు. ఆయనగారొచ్చే వేళకి అందంగా సింగారించుకుని గుమ్మంలో నిలు చుని ఎదురేగి చిర్నవ్వుల స్వాగతం పలుకుతు న్నారు శ్రీమతిగారు. వచ్చీరాగానే దుస్తులు విప్పి షవర్‌బాత్ చేసేందుకు సిద్ధమవుతారు శ్రీవారు. సబ్బు, టవల్ అందిస్తూనే అడపాదడపా ఒక్కో సారి ఆయనగారితో కలిసి 'సరిగంగ స్నానాలు' చేస్తారా శ్రీమతిగారు. ధూమపానాన్ని వెలివే సారు శ్రీవారు. పడకటింటిని ఆ ఇద్దరికే పరి మితం చేసేసారు వారు. జీవనరాగంలో అను క్షణం ఒక యుగళం.

సాయం సమయాల్లో ఆ ఇంటిముంగిట్లో రెండు కుర్చీలు, ఒక టీపాయ్. ఆ రెండు కుర్చీల్లో విశ్రాంతిగా కూర్చుని నైట్‌క్వీన్ గుబాళింపులా స్వాదిస్తూ గుసగుసలుపోతుంటారా జంట.

ఇది ఆ చుట్టుపక్కలవారికి ప్రతినిత్యం కని పించే దృశ్యమైంది.

అంతేనా! వారిద్దరి వెన్నెల జాగారాలు కోకొ ల్లలు. చలికాలం వచ్చిందా... ఇద్దరికీ సందడే సందడి. ఏసి థియేటర్లో సెకండ్‌షో వీక్షణాలు సరే సరి.

అవును, ఇకపై వారికి ప్రతిక్షణం పరిమళాల సుమదళమే.

అపార్థాలు తొలగి, ఒకరినొకరు సంపూర్ణంగా అర్థం చేసుకుని, ఒకరి ఇష్టాలను ఒకరు గౌర విస్తూ, ఒకరి అయిష్టాలను మరొకరు గమనిస్తూ సర్దుకుంటూ జతగా సాగిపోతున్న వారి సం సారంలో ప్రతిరోజు పెళ్ళిరోజే.

